క్లుప్తంగా

పురవీధుల్లో అయ్యప్పస్వామి అభయం


గ్రామవీధుల్లో అయ్యప్ప స్వామి ఊరేగింపు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని మండపం వీధిలో వెలసిన శ్రీఅయ్యప్ప స్వామివారి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి మాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో అయ్యప్ప మాలధారులు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుదరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అయ్యప్ప మాలధారులు అన్నప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో నీలకంఠరెడ్డి, ధనశేఖర్‌యాదవ్, ధనశేఖర్ మొదలియార్, సుమంత్, పలువురు పాల్గొన్నారు.

17 నుంచి ఏఐటీయూసీ మహాసభలు


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పుత్తూరు: తిరుపతి జిల్లా ఏఐటీయూసీ ప్రథమ మహాసభలను ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు శ్రీకాళహస్తిలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి మహేష్ తెలిపారు. సోమవారం మహాసభల కరపత్రాలను పుత్తూరులో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో తొలిసారిగా ఏర్పడిన కేంద్ర కార్మిక సంఘం ఏఐటీయూసీ అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ రాజీలేని పోరాటం చేస్తోందని తెలిపారు. అన్ని కార్మిక సంఘాలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న మహాసభలకు అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోదండపాణి, కై లాసం, గోపి, సెల్వరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పర్శలో తేడాలను గుర్తించాలి


విద్యార్థి స్పర్శను పరిశీలిస్తున్న డాక్టర్

పాలసముద్రం : కౌమార దశలో బాల, బాలికల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా వారికి అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి, సూపర్‌వైజర్ మురళి, సుశీల సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్ర, శనివారం బాల, బాలికల్లో రక్తహీనత నివారణకు ప్రతి గురువారం ఆరోగ్య సిబ్బంది ఐరన్ మాత్రలు మింగించాలని సూచించారు. శారీరక మార్పులతో వచ్చే సందేహాలను నివృత్తి చేసి తప్పులు చేయకుండా వారికి మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాలసముద్రం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పర్శలో తేడాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం గంగా గౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా భాషోత్సవాలు


భారతీయార్ వేషధారణలో విద్యార్థులు

నగరి : మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుబ్రమణ్య భారతీయార్ భాషోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తమిళకవి, స్వాతంత్ర్య పోరాట యోధులు భారతియార్ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్త వేడుకలకు కేంద్రప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో తమిళ విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే పుదుపేట పాఠశాలలో ఉపాధ్యాయులు భాషోత్సవాలను ప్రధానోపాధ్యాయులు టీవీ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. భారతీయార్ రచించిన పద్యాలు, గేయాలు విద్యార్థులచే పలికించారు. ఈ సందర్భంగా భారతీయార్ వేషధారణలతో విచ్చేసిన విద్యార్థులు అందరినీ అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్నాం.. ప్రజల్లో ఉంటున్నాం

- సాయం అందించడం.. పేదలను ఆదుకోవడం సీఎం జగనన్న నైజం
- దోచుకోవడం.. దాచుకోవడమే చంద్రబాబు తీరు
- మంత్రి ఆర్‌కే రోజా


లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ప్రజలకు సాయం అందిస్తూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ అనునిత్యం ప్రజల కోసం పరితపించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నైజమని, దోచుకోవడం–దాచుకోవడం ప్రతిపక్షనేత చంద్రబాబు నైజమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. సోమవారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ 5వ వార్డు పిళ్లారిపట్టు సచివాలయ పరిధిలోని పిళ్లారిపట్టు దళితవాడ, పిళ్లారిపట్టు, ఆంజనేయపురం, గణపతినగర్, గంగమాంబపురం గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ వస్తోందా ? అక్కా చేయూత తీసుకున్నారా ? వైఎస్సార్ ఆసరా మీ కుటుంబానికి అందుతోందా? అని ఆరా తీశారు. తమకు అన్ని పథకాలు అందుతున్నాయని మహిళలు ఆనందంగా చెప్పారు.



డ్రైనేజీ బాగు చేయాలని అధికారులకు సూచిస్తున్న మంత్రి, ఓ అవ్వకు మంత్రి రోజా ఆత్మీయ పలకరింపు

గతంలో జన్మభూమి కమిటీలదే పెత్తనం

ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే పథకాలు మంజూరు చేసేవారని గుర్తు చేశారు. నేటి జగనన్న ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని ఆరోపించారు. కానీ సీఎం జగనన్న నాలుగున్నరేళ్లలోనే అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. సంక్షేమ సారథిగా ప్రజా రంజక పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా కట్టిస్తున్న సీఎం జగనన్నదే అన్నారు. పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో మరోమారు గెలిపించుకుందామని అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, పరిశీలించి వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీఏ రమేష్‌రాజు, మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్, మైనారిటీ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు బి.రాధ, చిట్టిబాబు, పార్టీ నాయకులు జయరామిరెడ్డి, శివలింగం, భాస్కర్‌రెడ్డి, రమణ, శీనయ్య, వెంకటేష్‌రెడ్డి, మునిరత్నం, జయబాబు, మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు చక్కని అవకాశం


కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం : యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను 15 ఏళ్లు పైబడిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే వారికి ప్రభుత్వమే క్రీడా పరికరాల కిట్లను అందిస్తోందన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, గ్రామ ప్రజలు కృషి చేయాలని తెలిపారు. అనంతరం క్రీడా పోటీలకు సంబంధించిన ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ విద్యావతి, విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దృఢమైన సంకల్పానికి ఏదీ అడ్డుకాదు


దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ

నగరి : దృఢమైన సంకల్పానికి వికలత్వం అడ్డు కాదని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దృఢమైన సంకల్పం ఉంటే వికలత్వం అడ్డురాదన్నారు. ప్రభుత్వం ఇచ్చే భత్యాలు, భవిత కేంద్రంలో ఇచ్చే శిక్షణ గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ మేఘవర్ణం మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు విలువైన సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలు వినియోగించుకోవాలన్నారు. శ్రీరామాపురానికి చెందిన వత్సల అనే దాత భవిత పాఠశాలకు రూ.30 వేల విలువగల ఆర్‌ఓ ప్లాంట్‌ను అందించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుప్పరాజు, సహిత ఉపాధ్యాయులు భవాని, సంతోష్, ఫిజియో థెరపిస్ట్ కిషోర్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో వెదురుకుప్పం అధ్యాపకుడి ప్రతిభ


బంగారు పతకంతో చంద్రబాబు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న చంద్రబాబు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి, బంగారు పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో నిర్వహించిన 42వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో పాల్గొని, ఉత్తమ ప్రతిభను కనబరచినట్లు తెలిపారు. 5 కిలో మీటర్లు, 800 కిలో మీటర్ల పరుగులు పందెంలో విజయం సాధించి, బంగారు పతకం కైవసం చేసుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో పీడీ భరణీనాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మంత్రి ఆర్‌కే రోజా


మంత్రి ఆర్‌కే రోజాను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం మంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. కార్తీక మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మంత్రి రోజా స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆమె సోమవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆమెను ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్‌యాదవ్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కమిషనర్, కమిషనర్లతో ఆర్టీఐ సభ్యుల భేటీ


రాష్ట్ర ఆర్టీఐ ప్రధాన కమిషనర్ మహబూబ్ బాషాని కలిసిన బండి పట్టాభిరెడ్డి, సభ్యులు

గంగాధర నెల్లూరు: విజయవాడలో ఆర్టీఐ కమిషనర్ కార్యాలయంలో ప్రధాన కమిషనర్ ఆర్ మహబూబ్ బాషా, కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డిని సోమవారం మధ్యాహ్నం ఆ యూనియన్ సభ్యులతోపాటు జీడీ నెల్లూరు శాఖ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వినోద్ కుమార్, మోహన్ కుమార్, రాంప్రకాష్, జ్యోతి ప్రకాష్, శంకర్, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

శక్తి ఆదాతో భవిష్యత్ తరాలకు మేలు

తిరుపతి ఎడ్యుకేషన్: శక్తిని పొదుపుగా వాడుకుంటూ ఆదా చేయడం ద్వారా భవిష్యత్తు తరానికి ఎంతో మేలు చేసిన వారమవుతామని శ్రీపద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరిదేవి తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం, బీసీడీఈ సంయుక్తంగా ఎనర్జీ కన్జర్వేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజన్ కుమార్ మాట్లాడుతూ ఎనర్జీ తయారీకి అవసరమైన మూలాలు, అతిగా వాడడం వలన జరిగే అనర్థాలను వివరించారు. ఎన్ఆర్‌ఈడీసీఏపీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ సౌర శక్తి విధానం, సౌర శక్తి వినియోగంతో కలిగే ప్రయోజనాలు, సౌరశక్తి తయారీకి అవసరమైన పరికరాలపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం విభాగాధిపతి డాక్టర్ జగదీశ్వరి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రికార్డుల నమోదు సక్రమంగా ఉండాలి

పాలసముద్రం : మండలంలోని వీఓ లీడర్లు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్యపోషణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా ఇప్పుడు 10 మంది సభ్యులకు రూ.5 లక్షలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. స్త్రీనిధి, ఉన్నతి అప్పులపై సామాజిక తనిఖీ కూడా జరుగుతుందన్నారు. ఏ రకమైన అప్పు తీసుకున్నా 100 శాతం రికవరీ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా జల శక్తి సంఘాల ఏర్పాటు చేసుకుని ప్రతి ఇంటికీ నీటి కొళాయి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. డ్వాక్రా గ్రూపులు, సిబ్బందికి రికార్డులు రాసే విధానంపై, స్త్రీనిధి రికవరీ చేసే పద్ధతి, ఇంటి వద్ద పెరిటి కోళ్లు, పెరటి తోటలు పెంపకం వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు పుత్తూరు విద్యార్థులు


ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న పుత్తూరు విద్యార్థినులు

పుత్తూరు: కార్వేటినగరం డైట్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో పుత్తూరు బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానాలను కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. 9వ తరగతి చదివే ఎస్.మేఘన విజువల్ ఆర్ట్స్‌లో, ఎన్.గోపిక జానపద నృత్య విభాగాల్లో ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. వీరు ఈనెల 15న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొంటారు. అలాగే శాస్త్రీయ సంగీతం (గాత్రం) విభాగంలో ఎ.శ్రావణి, శాస్త్రీయ నృత్య విభాగంలో ఎం.నిత్య ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. కళాఉత్సవ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి పుత్తూరుకు మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థినులను ఎంఈఓ తిరుమలరాజు అభినందించారు.

రౌడీ షీటర్ దారుణ హత్య


హత్యకు గురైన కిషోర్(ఫైల్)

తిరుపతి క్రైమ్: రౌడీషీటర్ దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిలోని సుబ్బారెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న భూపాల్ కుమారుడు కిషోర్(30) జులాయిగా తిరిగేవాడు. ఇదేక్రమంలో గత వారం తన కాలనీలో నివాసముంటున్న ఓ మహిళను అప్రోజే అనే యువకుడు ఏడిపించాడు. ఈ విషయం కిషోర్‌కి తెలిసింది. దీంతో అప్రోజేను పిలిపించి వార్నింగ్ ఇచ్చాడు. దీంతో అప్రోజే తన స్నేహితులు దేవేంద్ర, లోకేష్ స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి సుబ్బారెడ్డి నగర్‌లో ఉన్న కిషోర్‌తో గొడవ పడ్డారు. ఆపై దేవేంద్ర, లోకేష్ స్నేహితులైన శివ, రాహుల్, చరణ్ మరికొందరితో కలిసి కిషోర్‌ని చంపేయాలని నిశ్చయించారు. ఆదివారం రాత్రి కిషోర్ సుబ్బారెడ్డి నగర్‌లోని రోడ్డు పక్కన ఉన్న చీకటి ప్రాంతంలో మద్యం సేవిస్తుండగా అందరూ వెళ్లి గొడవపడి కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందివ్వకుండా వారి స్వగ్రామమైన వెదురుకుపం మండలం, బలిజపల్లికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆపై పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు. మృతుడు రౌడీషీటర్ అని పోలీసులు తెలిపారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు


నగరి: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, కార్వేటినగరం: తంగమేశ్వరస్వామి, వెదురుకుప్పం: కొండమల్లీశ్వరుడు

నగరి : మండలంలోని ముడిపల్లిలో కార్తీక సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. సోమవారం శ్రీవాణి గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం వారు కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సుమారు 600 ఏళ్ల కిందట నిర్మితమైన శ్రీ కామాక్షమ్మ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామ బిల్వార్చన మహా వైభవంగా జరిగింది. సంఘ అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం, ఆలయ నిర్వాహకులు నాగరాజ్ శర్మ బ్రాహ్మణ సంఘ సభ్యులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నవీన్ కుమార్ శర్మ, బాలాజీ రాంప్రసాద్ శర్మ, వేలాయుధం ప్రసాద్ శర్మ, కేవీ సురేష్, ఎల్ఐసీ సురేష్ కుమార్, నరసింహం, దామరపాకం బాబు కుమారు, శివప్రసాద్, చందు తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

తంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు

కార్వేటినగరం: సంస్థానాధీశుల చారిత్రక కట్టడాల్లో ఒక్కటైన స్కంధపుష్కరిణి సమీపంలో వెలసిన శ్రీతంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు పాలు, పెరుగు, నారికేళ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో పాటు విభూదితో అభిషేకించారు. అనంతరం స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరం అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయానికి విచ్చేసిన మహిళా భక్తులు స్వామివారిని నేతిదీపాలు వెలిగించి, కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు, అన్న ప్రసాదాలను పంచిపెట్టారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని గంగాధరేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ పూజారి బాలాజీ స్వామి ఆధ్వర్యంలో ఉదయం మహారుద్రాభిషేకాలు, ప్రత్యేక బిల్వార్చన,ఆకాశ దీపం, లక్ష దీపార్చన, నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలో చుట్టుపక్కల గ్రామీణ ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

కొండమల్లీశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేపట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు.

ఎస్వీయూలో ఘనంగా అథ్లెటిక్ మీట్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్వీయూ రిజిస్ట్రార్

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ సోమవారం ఎస్వీయూ స్టేడియంలో ఘనంగా జరిగింది. ఈ అథ్లెటిక్ మీట్‌ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మొహమ్మద్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుందని, ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం వర్సిటీ పరిధిలోని 30 కళాశాలల నుంచి హాజరైన 300 మందికిపైగా క్రీడాకారులు రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హేమర్, లాంగ్ జంప్, హైజంప్ వివిధ క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ స్పందనలో నమోదయ్యే అర్జీలను ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు స్పందనలో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 383 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ తక్షణమే క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను పరిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఆయా శాఖలకు స్పందన కార్యక్రమం ద్వారా అందే అర్జీలను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో శివయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

స్పందన సమస్యలకు ప్రాధాన్యం

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ సమస్యలపై ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఎస్ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తికి సైతం వినతులు అందచేయగా.. వాటిని విచారించి న్యాయం చేస్తామన్నారు.